

చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 526 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



నిరుద్యోగుల కల్పతరువు
ఎస్కేయూ సమీపంలో ఏర్పాటైన రూడ్‌సెట్ సంస్థ జిల్లాలో నిరుద్యోగులకు కల్పతరువుగా మారింది.
8లో



తుపాను వాతావరణం కారణంగా జిల్లావ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని మండలాల్లో తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

క్వింటా చింతపండు రూ.13 వేలు


మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.13 వేలు పలికింది. మార్కెట్‌కు సోమవారం 587 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్ఠంగా రూ.13 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరిన రూ.10,500 మేర పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.7 వేలు, కనిష్ఠంగా రూ.4,100, సగటున రూ.5,500 ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- నేరస్తుల ఇళ్లలో పోలీసుల తనిఖీలు
- గ్రామసభలతో ప్రజలకు అవగాహన


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లు, వివిధ కేసుల్లో నేరస్తుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ప్రశాంత జీవనం గడపాలని, ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాల తర్వాత జిల్లా వ్యాప్తంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామన్నారు. శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగానే అసాంఘిక శక్తులను అణచి వేస్తున్నామన్నారు. అందరూ గొడవలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా రాజకీయ పరమైన వివాదాలు సృష్టించకూడదన్నారు. అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాణాసంచా తయారీ, విక్రయాలపై నిషేధం

పుట్టపర్తి అర్బన్: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కలెక్టర్ అరుణ్‌బాబు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే జూన్ 5వ తేదీ వరకూ జిల్లాలో బాణాసంచా తయారీ, విక్రయాలపై నిషేధం విధిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పేలుడు చట్టం 1884లోని సెక్షన్ 6ఏ ప్రకారం క్రాకర్ల తయారీ, అమ్మకం, కొనుగోలు, వినియోగం, రవాణాపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. గెలుపొందిన అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీలు, విజయోత్సవాలు చేయడం, బాణాసంచా కాల్చడం వాటితో తలెత్తే పరిణామాలను దృష్టిలో ఉంచుకొని నిషేధం విధించినట్లు వెల్లడించారు. బాణాసంచా విక్రయ దుకాణాల యజమానులు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

అక్రమ మద్యం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు


ముద్దాయిని సబ్‌జైలుకు తరలిస్తున్న పోలీసు

పెనుకొండ: మద్యాన్ని అక్రమంగా తరలించి పట్టుబడిన ఓ వ్యక్తికి పెనుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మరువపల్లికి చెందిన బోయ నాగరాజు 2020 మే 23న ఓల్డ్ ట్రావెన్ విస్కీ 130 ప్యాకెట్లు తీసుకెళుతూ అప్పటి ఎస్‌ఐ హరూన్ బాషాకు పట్టుబడ్డాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు సోమవారం విచారణకు రాగా, ముద్దాయి బోయ నాగరాజుకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ జూనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప తీర్పు వెలువరించారు. దీంతో నాగరాజును పోలీసులు సబ్‌జైలుకు తరలించారు.

అభివృద్ధికి ‘బాట’లు

రోడ్డుంటే చాలు అభివృద్ధికి అడుగు పడుతుంది. పల్లెలకు పట్టణాలకు మధ్య రాకపోకలు పెరుగుతాయి. ఇతర ప్రాంతాలతో సంబంధాలు ఏర్పడతాయి. అర్ధ రాత్రి వేళ కూడా ఎక్కడికైనా వెళ్లే సౌకర్యం కలుగుతుంది. పారిశ్రామిక అభివృద్ధికి ‘మార్గం’ ఏర్పడుతుంది. విద్య, ఉపాధికి ‘బాటలు’ పరుచుకుంటాయి. అందువల్లే గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ సర్కార్ జిల్లా అభివృద్ధిలో భాగంగా రోడ్లపై దృష్టి సారించింది. జాతీయ రహదారుల ఏర్పాటుతో ప్రగతికి దారులు పరిచింది.

- జిల్లాలో రూ.4 వేల కోట్లతో జాతీయ రహదారి పనులు
- సుమారు 250 కి.మీ మేర రోడ్ల నిర్మాణాలు
- పలు జిల్లాలతో అనుసంధానం
- మెరుగుపడనున్న రవాణా సౌకర్యం


కదిరి బైపాస్‌రోడ్డు

జిల్లాలో జరుగుతున్న ఎన్‌హెచ్ రోడ్ల పనులు ఇలా..

రోడ్ల వివరాలు	నిధులు (రూ.కోట్లు)	కిలో మీటర్లు
కదిరి బైపాస్ రోడ్డు	234	13
బి.కొత్తపల్లి-గోరంట్ల	840	57
పుట్టపర్తి-కోడూరు	1,320	47
పుట్టపర్తి-ముదిగుబ్బ	402	32
మడకశిర-శిర	208	42
పరిగి-హిందూపురం	99	20
ముదిగుబ్బ-బత్తలపల్లి	536	33
ముదిగుబ్బ బైపాస్ రోడ్డు	117	8

కదిరి: సంక్షేమంతో పాటు అభివృద్ధికీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా నాగరికతకు చిహ్నాలుగా భావించే రహదారుల ఏర్పాటుపై దృష్టి సారించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో 250 కి.మీ మేర జాతీయ రహదారులు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఏకంగా రూ.4వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ రహదారుల పనులన్నీ పూర్తయితే జిల్లానుంచి ఇతర ప్రాంతాలకు రవాణా సౌకర్యం సులువు అవుతుంది. ప్రయాణ సమయం కూడా బాగా తగ్గుతుంది.

అనతి కాలంలోనే అనేక రహదారులు..
గత ఐదేళ్లలో రెండేళ్లు కోవిడ్ మినహాయిస్తే మిగిలిన మూడేళ్లలో జగన్ సర్కార్ నూతన జిల్లా శ్రీసత్యసాయి అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో రహదారుల నిర్మాణం కోసం పెద్ద మొత్తంలో నిధులు తీసుకొచ్చింది. ఆ పనుల్లో కొన్ని పూర్తి కావచ్చాయి. మరికొన్ని భూసేకరణ జాప్యంతో కాస్త ఆలస్యమయ్యాయి. వీటితో పాటు పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల పరిధిలో చేపట్టిన రహదారులతో ఎన్నో గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది.

కదిరి బైపాస్‌రోడ్డుకే రూ.234 కోట్లు..
కదిరికి రింగ్‌రోడ్డు తరహాలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుకు ప్రభుత్వం రూ.234 కోట్లు ఖర్చు చేసింది. ఈ పనులు పూర్తి కావచ్చాయి. మడకశిర–శిర మధ్య రూ.207 కోట్లతో నిర్మించిన జాతీయ రహదారితో పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంతో రవాణా సౌకర్యం మరింత మెరుగుపడింది. తలుపుల మండలం బి.కొత్తపల్లి నుంచి గోరంట్ల వరకూ రూ.840 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. పుట్టపర్తి–కోడూరు మధ్య రూ.1,320 కోట్లతో నిర్మిస్తున్న పనులు జోరందుకున్నాయి. ముదిగుబ్బ–బత్తలపల్లి మధ్య రూ.536 కోట్లతో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు ఊపందుకున్నాయి. పుట్టపర్తి–ముదిగుబ్బ మధ్య రూ.400 కోట్లతో చేపట్టిన పనులు 65 శాతం పూర్తయ్యాయి. హిందూపురం–పరిగి మధ్య రూ.100 కోట్లతో చేపట్టిన జాతీయ రహదారి పనులు పూర్తి కావచ్చాయి. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన రహదారుల పనులన్నీ పూర్తయితే రవాణా సౌకర్యం పూర్తిగా మెరుగుపడుతుంది. తద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం ఏర్పడుతుంది. తద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

అభివృద్ధి కళ్లారా చూస్తున్నాం



ఈ ప్రభుత్వంలో అభివృద్ధి కళ్లారా చూస్తున్నాం. గతంలో ఎవరూ ఇంత పెద్ద ఎత్తున కేవలం ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో ఇన్ని రోడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోందని చెప్పడానికి ఈ రోడ్డే సాక్ష్యం. రహదారుల నిర్మాణంతో జిల్లాతో కనెక్టివిటీ పెరుగుతుంది. తద్వారా అన్ని రకాలుగా మేలు జరుగుతుంది.
– ఎద్దుల హనుమంతురెడ్డి, దాదిరెడ్డిపల్లి,ఓడీ చెరువు మండలం

పనులు వేగవంతం



జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ జాతీయ రహదారుల పనులు వేగవంతమయ్యాయి. భూసేకరణ సమస్య ఉన్న చోట మధ్యవర్తుల సహకారంతో వివాదాలు పరిష్కరించి భూసేకరణ పూర్తి చేశాం. పనులు కూడా ప్రారంభించాం. జిల్లాలో చేపట్టిన రహదారుల పనులన్నీ పూర్తయితే రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. అప్పుడు ప్రయాణ సమయం కూడా బాగా తగ్గుతుంది.
– అరుణ్‌బాబు, కలెక్టర్

ఇంగ్లిష్ పరీక్షకు 657 మంది గైర్హాజరు

కొత్తచెరువు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం 29 కేంద్రాల్లో నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 657 మంది గైర్హాజరయ్యారని డీఈఓ మీనాక్షి తెలిపారు. మొత్తం 972 మంది విద్యార్థులకు గాను 315 మంది పరీక్షకు హాజరయ్యారని ఆమె వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్త కోర్సులకు ఏఐసీటీఈ ఆమోదం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారు. కంప్యూటర్ సైన్సెస్ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ , డేటా సైన్సెస్ రెండు కోర్సులను అమలు చేస్తున్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లు చొప్పున 120 సీట్లు మంజూరు చేస్తూ ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) అనుమతి ఇచ్చింది. ఏఐసీటీఈ ఉత్తర్వులను ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యకు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అందజేశారు.

సూచనలు పాటిస్తే మేలు

- రైతులకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి సూచన

బుక్కరాయసముద్రం: పంటల సాగులో వాతావరణ ఆధారిత సూచనలు పాటిస్తే మేలు కలుగుతుందని రైతులకు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల్లో దుక్కులు చేసుకోవాలన్నారు. దీంతో తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. గాలి, సూర్యరశ్మి బాగా చేరి సారవంతమవుతుందన్నారు. కలుపు, తెగుళ్ల ఉధ్రుతి తగ్గుతాయన్నారు. ఖరీఫ్ సాగుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేరుశనగలో కదిరి లేపాక్షి, కదిరి హరితాంధ్ర, టీసీజీఎస్–1694, కే6, ధరణి తదితర విత్తనాలను విత్తు కోవాలన్నారు.

● నమో వేంకటేశాయ


అశేష భక్తజనం నడుమ సాగుతున్న ప్రసన్న వేంకటరమణస్వామి రథోత్సవం, (ఇన్‌సెట్) మూలవిరాట్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. భక్తజనంతో వినాయక సర్కిల్ నుంచి నేసేపేట బొడ్డురాయి వరకూ ప్రాంతం కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఉదయం 11.30 గంటలకు తేరుబజారు వద్ద అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రథాంగ పూజలు చేశారు. వేలాది మంది భక్తులు మడుగు రథాన్ని వినాయక సర్కిల్ వరకు లాగారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించిన బ్రహ్మ రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. నమో వేంకటేశాయ నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్ సీపీ నేత మెట్టు విశ్వనాథరెడ్డి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, కౌన్సిలర్లు, దేవాదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి, పట్టణ ప్రముఖులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. రెడిమేడ్ గార్మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 31న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఐదు, ఇంటర్ తరగతుల్లో చేరే వారికి బీఆర్ఏజీ సెట్–2024లో ర్యాంకుల ఆధారంగా కురుగుంట గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

- ఐదో తరగతికి సంబంధించి బాలుర పాఠశాలల్లో 26 సీట్లుల ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ కేటగిరీలో 7133 నుంచి 7936 ర్యాంక్ వరకు, ఎస్టీ కేటగిరీలో 3375 నుంచి 3435 ర్యాంక్ వరకు, బీసీ కేటగిరిలో 54 నుంచి 71 ర్యాంక్ వరకు, ఓసీ కేటగిరీలో 111 నుంచి 117 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.
- బాలిలకు సంబంధించి 12 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ కేటగిరీలో 9711 ర్యాంక్ నుంచి 9778 వరకు, బీసీ కేటగిరిలో 201 నుంచి 308 ర్యాంక్ వరకు, ఓసీ కేటగిరీలో 171 నుంచి 211 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

31న ఇంటర్ సీట్లకు కౌన్సెలింగ్
బాలుర పాఠశాలల్లో 14 ఇంటర్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ కేటగిరీలో 7569 ర్యాంక్ నుంచి 7676 వరకు, ఎస్టీ కేటగిరీలో 4951 నుంచి 7352 ర్యాంక్ వరకు, బీసీ కేటగిరీలో 392 నుంచి 475 ర్యాంక్ వరకు హాజరుకావాలన్నారు.

- బాలికలకు సంబంధించి 19 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ కేటగిరీలో 18,523 ర్యాంక్ నుంచి 18,782 వరకు, ఎస్టీ కేటగిరీలో 11,821 నుంచి 11,981 ర్యాంక్ వరకు, బీసీ కేటగిరీలో 1334 నుంచి 1998 ర్యాంక్ వరకు, ఓసీ కేటగిరీలో 1894 నుంచి 2072 ర్యాంక్ వరకు హాజరుకావాలన్నారు.
- కౌన్సెలింగ్ సమాచారాన్ని విద్యార్థుల మొబైల్ నంబర్లకు పంపామని, మెరిట్‌కార్డ్, మార్కుల జాబితా, స్టడీ, ఆధార్‌కార్డ్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలన్నారు.

ఈసీ నిబంధనల మేరకే కౌంటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు


పాల్గొన్న పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థులు

- పక్కాగా ఏర్పాట్లు చేశాం
- అభ్యర్థులు, ఏజెంట్లు యంత్రాంగానికి సహకరించాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు విజ్ఞప్తి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరిక

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే కౌంటింగ్ ప్రక్రియ చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. జూన్ 4వ తేదీన హిందూపురం సమీపంలోని బిట్ ఇంజినీరింగ్ కళాశాల, లేపాక్షి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు అన్ని విధాలా సహకరించాలని కోరారు. సోమవారం ఆయన ఎస్పీ మాధవరెడ్డితో కలిసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఓట్ల లెక్కింపు విషయమై పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు.

అభ్యర్థులు, ఏజెంట్లకే అనుమతి..
కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, అందరి సమష్టి కృషితోనే పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, ఇదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా పూర్తి చేద్దామని కోరారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 7 గంటలకే ఏజెంట్లు కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ హాల్‌లోకి అభ్యర్థికీ, కౌంటింగ్ ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. మీడియా వారికి మీడియా పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా అంతటా 144 సెక్షన్ అమలవుతోందన్నారు. ఎలాంటి గొడవలు, హింసాత్మక సంఘటనలకు పాల్పడవద్దన్నారు. కచ్చితమైన ఫలితాలను వీలైనంత త్వరగా ప్రకటించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు అనంతపురం జేఎన్‌టీయూలో, ధర్మవరం , పుట్టపర్తి అసెంబ్లీ నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాలలో, మడకశిర, పెనుకొండ, కదిరి, హిందూపురం అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు హిందూపురం సమీపంలోని బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లను ఆర్‌ఓలు, పార్టీల ప్రతినిధుల సమక్షంలో బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంలకు తరలించనున్నట్లు చెప్పారు.

గెజిటెడ్ అధికారి సంతకం తప్పక ఉండాలి..
పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు గురించి అభ్యర్థులు, ఏజెంట్లు సంపూర్ణంగా అర్థం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఇందులో రెండు కవర్లు ఉంటాయని, మొదటి కవర్‌ను ఫారం 13–సి అంటారని, ఆ కవర్ తెరిస్తే రెండు ఫారాలు ఉంటాయని అందులో ఒకటి డిక్లరేషన్ 13–ఏ, ఇంకొకటి 13–బీ ఉంటుందన్నారు. ఫాం13–బీలోనే పోస్టల్ బ్యాలెట్ ఉంటుందన్నారు. డిక్లరేషన్ 13లో తప్పనిసరిగా ఓటరు సంతకం, గెజిటెడ్ అధికారి సంతకం చేసి స్టాంప్ వేయడం లేదా హోదా రాసి ఉంటేనే చెల్లుబాటు అవుతుందన్నారు. ఒక్కో టేబుల్‌కు 500 చొప్పున పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక ఏజెంట్‌ను అభ్యర్థుల తరపున నియమించుకోవచ్చన్నారు.

ఊరేగింపులు, బహిరంగ సభలు నిషేధం..
ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, కౌంటింగ్ సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కఠిన వ్యవహరిస్తామన్నారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. అనుమతులు లేకుండా ఊరేగింపులు, బహిరంగ సభలు, సమావేశాలు ఎట్టి పరిస్థితిలోనూ నిర్వహించకూడదన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ జరిగే సమయంలో, ఫలితాల తర్వాత హింసలకు పాల్పడితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు. యువతకు పాస్‌పోర్టులు నిరాకరిస్తామని, ఉద్యోగ అవకాశాలు కోల్పోతారన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదని, ఏవైనా సమస్యలుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విడిగా పెట్రోలు, డీజిల్ అమ్మకాలపై నిషేధం విధించామన్నారు.

ఐడీ కార్డులు లేకపోతే అనుమతించం..
డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ, అభ్యర్థులు జూన్ 1వ తేదీలోపు ఏజెంట్ల వివరాలతో ఫాం–18 పూరించి సంబంధిత ఆర్‌ఓలకు రెండు దరఖాస్తులు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందజేయాలన్నారు. తద్వారా ఐడీ కార్డులు అందజేస్తామన్నారు. ఐడీ కార్డులు లేక పోతే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి తరపున వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సమద్‌సాహీన్, టీడీపీ ఎంపీ పార్థసారథి, బీఎస్పీ తరపున భాగ్య, రమేష్, శ్రీనివాసులు, ధనుంజయ, ఎన్నికల డీటీ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్నోబిలేశుడి బ్రహ్మరథోత్సవం


సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ: ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మరథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఉదయం 10 గంటలకు మడుగు తేరు లాగిన అనంతరం సాయంత్రం 5 గంటలకు ధూళోత్సవం నిర్వహిస్తారు. తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగు నీరు, ఉచిత భోజన వసతి, మరుగుదొడ్ల వసతి, ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. స్వామి సన్నిధిలో దాసాంగాలు పెట్టుకొనే భక్తులకు ప్రత్యేకంగా కాటేజులు, వసతి సముదాయాలు కేటాయించారు. పెన్నహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి రథోత్సవం సందర్భంగా ఆర్టీసీ కూడా కావాల్సినన్ని బస్సులు నడపనుంది. భక్తుల కోసం ఉరవకొండ నుంచి ప్రతి 5 నిమిషాలకు ఒక సర్వీసును అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. ఇక.. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

వైభవంగా సూర్యప్రభ వాహన సేవ..
బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు భూదేవి, శ్రీదేవి సమేతంగా సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సనాతన హైందవ సంప్రదాయంలో సూర్యారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. సూర్యప్రభ వాహనంపై ఉన్న స్వామిని దర్శించుకుంటే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో వాహన సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథ చార్యులు, బాలాజీస్వామిలు పాల్గొన్నారు.


ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

నిరుద్యోగులకు కల్పతరువు రూడ్‌సెట్



'మానవ సేవే మాధవసేవ అనే సేవా భావం అలవర్చుకుని... సామాన్య ప్రజలకు సేవ చేస్తుండడం గొప్ప అనుభూతి కలిగిస్తోంది. సంస్థలో శిక్షణ పొందుతున్న అభ్యర్థుల క్రమ శిక్షణ, సోదరభావం నన్ను ఆక ట్టుకున్నాయి. భవిష్యత్తు సృష్టికర్తలు మీరే అని ప్రగాఢంగా నమ్ముతున్నా. అనంత పురం జిల్లాలో ఇలాంటి సంస్థలు ఉండడం గొప్ప విషయంగా భావిస్తున్నా.'

.... ఈ మాటలు అన్నది ఎవరో కాదు... ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా ఉన్న డాక్టర్ వి.వినోద్‌కుమార్ తన ఐఏఎస్ శిక్షణలో భాగంగా 2017లో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో రూడ్‌సెట్‌ను పరిశీలించిన ఆయన తన భావనను అప్పట్లో అక్కడి విజిటర్స్ పుస్తకంలో ఇలా పంచుకున్నారు.

ధర్మస్థలం ట్రస్టు, కెనరా బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (రూడ్‌సెట్) నిరుద్యోగుల పాలిట కల్పతరువుగా మారింది. 28 రకాల కోర్సుల్లో ఉచితంగా వసతితో కూడిన శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఉపాధి అవకాశాలు కల్పించి, వారి పురోగతికి దోహదపడుతోంది. రూడ్‌సెట్‌లో శిక్షణ పొందిన ఎందరో నేడు ఉన్నత శ్రేణిలో జీవనం సాగిస్తున్నారు.

- 28 రకాల కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు
- ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతకు వరం

అనంతపురం: గ్రామీణ నిరుద్యోగుల్లో సాధికారత నింపే లక్ష్యంతో ఏర్పాటైన రూడ్‌సెట్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్య సాధనలో విజయవంతంగా ముందుకు సాగుతోంది. నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇవ్వడమే కాక వారి జీవనోపాధులను మెరుగు పరిచి ఉన్నత శ్రేణి జీవితాన్ని అందించడంలో రూడ్‌సెట్ కీలక పాత్ర పోషిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 840 మంది శిక్షణ పొందగా... వీరిలో 308 మందికి బ్యాంకుల సహకారంతో రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు. మరో 295 మంది స్వతహాగా స్వయం ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. 10 మంది ఇతర సంస్థల్లో ఉపాధి పొందుతున్నారు.

శిక్షణ పూర్తికాగానే బ్యాంక్ రుణం

అనంతపురంలోని ఎస్కేయూ సమీపంలో ఉన్న రూడ్‌సెట్ సంస్థలో ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ మహిళలు, పురుషులకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తోంది. ఆధార్ కార్డు కలిగి ఉండి... 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులు. మొత్తం 28 రకాల కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆసక్తి ఉన్న వారికి బ్యాంక్ లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించి వ్యాపారాభివృద్ధికి బాటలు వేస్తోంది. ఈ మొత్తం ప్రక్రియలో ఎలాంటి లాభాపేక్షను సంస్థ ఆశించకపోవడం గమనార్హం. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయడం లేదు. కాగా, ఉచితంగా హాస్టల్ సదుపాయం, భోజన వసతి కల్పిస్తారు. సంవత్సరంలోనే ప్రతి నెలా ఒక్కో రంగానికి సంబంధించి శిక్షణ ఇస్తారు. నెల రోజుల్లోపు శిక్షణ పూర్తి చేసిన అనంతరం స్వయం ఉపాధి కల్పనపై అవగాహన కల్పిస్తారు.

- డ్రెస్ డిజైనింగ్ ఫర్ ఉమెన్, పికిల్ అండ్ పాపెడ్ మేకింగ్, సిల్క్ థ్రెడ్ అండ్ జ్యువెలరీ మేకింగ్‌పై మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.
- సోలార్ అండ్ ఎల్‌ఈడీ ఎక్విప్‌మెంట్ అసెంబ్లింగ్, మల్టీ ఫోన్ సర్వీసింగ్, స్మార్ట్‌ఫోన్ సర్వీసింగ్, ఎల్‌ఎంవీ డ్రైవింగ్, ఎలక్ట్రికల్ మోటార్ రీవైండింగ్ అండ్ పంప్‌సెట్ మెయింటెనెన్స్ కోర్సులపై పురుషులకు శిక్షణ ఇస్తారు.



రూడ్‌సెట్ భవనం

అందిస్తున్న కోర్సులు

కోర్సు	అర్హులు	కాల వ్యవధి
ఉమెన్స్ టైలరింగ్	మహిళలు	30 రోజులు
బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్	మహిళలు	30 రోజులు
ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్, సర్వీసెస్	పురుషులు	30 రోజులు
డెయిరీ ఫార్మింగ్, వర్మీ కంపోస్ట్	పురుషులు	10 రోజులు
ఫొటోగ్రఫీ/వీడియోగ్రఫీ	పురుషులు	30 రోజులు
గొర్రెల పెంపకం	పురుషులు	10 రోజులు
ఇన్‌స్టలేషన్ అండ్ సర్వీసింగ్ ఆఫ్ సీసీ టీవీ	పురుషులు	13 రోజులు
ఎంబ్రాయిడరీ అండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్	మహిళలు	30 రోజులు
కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్	---	45 రోజులు

త్వరలో మరిన్ని కొత్త కోర్సులు



రూడ్‌సెట్ సంస్థ వ్యవస్థాపకులు వీరేంద్ర హెగ్డే కల సాకారం చేస్తూ నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నాం. ప్రతి ఒక్కరూ జీవితంలో స్థిరపడడమే కాకుండా వారు మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా చేస్తున్నాం. శిక్షణ పొందే వారికి ఉచితంగా వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నాం. త్వరలో మరిన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచన ఉంది.

– ఎస్. విజయలక్ష్మి , రూడ్‌సెట్ డైరెక్టర్, అనంతపురం

ప్రముఖ సంస్థల జాబితాలో చోటు దక్కడం ఖాయం



అనంతపురంలోని రూడ్‌సెట్ సంస్థకు రాష్ట్రంలోని ప్రముఖ సంస్థల జాబితాలో చోటు దక్కడం ఖాయమనిపిస్తోంది. టీంవర్క్‌తో అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో స్వల్పకాలంలోనే సంస్థ ప్రతిష్ట పెరిగింది. జిల్లా అధికారుల సహకారంతో కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణం.

– డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ (రూడ్‌సెట్ విజిటర్స్ బుక్ సౌజన్యంతో)

క్లుప్తంగా

పీహెచ్‌సీలో గొడవపై విచారణ



విచారణ చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి

గోరంట్ల: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆశ వర్కర్ శబరి మధ్య చోటు చేసుకున్న గొడవపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 7వ తేదీన పీహెచ్‌సీలోనే ఇద్దరూ తీవ్ర స్థాయిలో గొడవ పడ్డారు. ఎంఎల్‌ఎచ్‌పీ తనను వేధిస్తున్నారంటూ అప్పట్లో శబరి ఆత్మహత్యాయత్నం చేశారు. అనంతరం జరిగిన ఘటనపై న్యాయం చేయాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు, కలెక్టర్‌కు ఆమె ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్థాయి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి సోమవారం గోరంట్లకు చేరుకుని పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఉద్యోగులను వేర్వేరుగా విచారణ జరిపారు. వారి వాంగ్మూలాన్ని రాతపూర్వకంగా తీసుకున్నారు. దీనిపై తుది నివేదిక సిద్ధం చేసి, డీఎంహెచ్‌ఓకు అందజేయనున్నట్లు డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పదో తరగతిలో ఉత్తీర్ణతే లక్ష్యం

- సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ శివరంగప్రసాద్

పరిగి: గత పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి ఉత్తీర్ణత కాలేని విద్యార్థులంతా ప్రస్తుతం జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పకుండా విజయం సాధించాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్ ఆకాంక్షించారు. సోమవారం ఆయన పరిగిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. గత పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణను పరిశీలించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ వీరనారాయణ పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



సర్టిఫికెట్ ఫాంను అభ్యర్థులకు అందజేస్తున్న పాలిసెట్ కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి

అనంతపురం: పాలిసెట్–2024 వెబ్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో బాలికలు 52, బాలురు 74 మంది, మొత్తం 126 మంది హాజరైనట్లు పాలిసెట్ కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు.

యోగా చాంపియన్‌గా పరిగి వాసి



నవీన్ కుమార్

పరిగి: హిమాలయా అకాడమీ, ఇండియన్ యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగిన ఇండో–నేపాల్ యోగా చాంపియన్ షిప్ పోటీల్లో పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన నవీన్ ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నాడు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఖాట్మండులో పోటీలు జరిగాయి. పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొన్న నవీన్ అద్భుత ప్రదర్శనతో చాంపియన్‌షిప్‌ను దక్కించుకోవడంపై తల్లిదండ్రులతో పాటు పీడీ ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



శ్రీనివాసచారి (ఫైల్)

కణేకల్లు: విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం ఆదిగానిపల్లికి చెందిన కమ్మరి శ్రీనివాసచారి (45) వ్యవసాయ పనిముట్లు (వెల్డర్) చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దిన చర్యలో భాగంగా సోమవారం మధ్యాహ్నం మడకల పరికరాలకు వెల్డింగ్ చేస్తున్న సమయంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న శ్రీనివాసాచారిని కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కౌంటింగ్ సజావుగా సాగాలి



మాట్లాడుతున్న ఆర్‌ఓ అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్: హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. జూన్ 4న బిట్ కళాశాలలో జరిగే కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు హిందూపురంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యాక్రమంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వరాదన్నారు. కౌంటింగ్ విధానం, పాటించాల్సిన నియమాలు, తీసుకోవాలని జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాదరెడ్డి, లేపాక్షి తహసీల్దార్ బాలనరసింహులు, చిలమత్తూరు తహసీల్దార్ భాగ్యలత, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఆర్‌ఐ అమరేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కచ్చితమైన పరిష్కారం



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు

అనంతపురం: ప్రజాప్రయోజన సేవల కేసుల్లో కక్షిదారులకు శాశ్వత లోక్ అదాలత్ ద్వారా కచ్చితమైన పరిష్కారం దొరుకుతుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. శాశ్వత లోక్‌అదాలత్ ప్రజాప్రయోజన కేసుల పరిష్కారంపై వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు స్థానిక న్యాయ సేవాసదన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఇరుపక్షాల అంగీకారంతో కేసులను సామరస్యంగా పరిష్కరించేందుకు సమాన అవకాశాలను ధర్మాసనం ఇస్తుందన్నారు. రాజీ కుదరని పక్షంలో తీర్పు వెలువరిస్తుందన్నారు. సహజ న్యాయ సూత్రాల ఆధారంగా శాశ్వత లోక్‌అదాలత్‌లో వివాదం పరిష్కారం అవుతుందన్నారు. ఇది అప్పీలు లేని శాశ్వత లోక్ అదాలత్ తీర్పుగా పరిగణనలోకి వస్తుందన్నారు. ఫిర్యాదు చేయడానికి ఎలాంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కోటి రూపాయల పరిహారం వరకూ వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం శాశ్వత లోక అదాలత్‌కు ఉందన్నారు. ఫిర్యాదు దాఖలు చేయడానికి మూడు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



ఓబులేసు (ఫైల్)

అనంతపురం: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన వరికూటి ముత్యాలు కుమారుడు ఓబులేసు (49) ఇతరుల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి అవసరాలు, వ్యవసాయానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారులతో అప్పు చేశాడు. అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షల వరకూ చేరుకుంది. ఈ క్రమంలో డబ్బు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రమయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన ఓబులేసు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనంతపురం నాల్గో పట్టణ సీఐ ఆర్.ప్రతాపరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సబ్ పోస్ట్‌మాస్టర్ల బదిలీ

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా శాఖ డివిజన్‌లో 18 మంది సబ్ పోస్ట్‌మాస్టర్లను బదిలీ చేశారు. ఈ మేరకు ఆ శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ గుంపస్వామి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు జూన్ 30వ తేదీ లోపు కొత్త స్థానాల్లో చేరాలని ఆదేశించారు. బదిలీ అయిన వారిలో అనంతపురంలోని వివిధ పోస్టాఫీసుల్లో పనిచేస్తున్న బీఎం జిలానీ, ఎల్. సరా ప్రీతిక, ఎస్.దాక్షాయణి, వీఆర్ గిరిబాబు, బీఓ రాఘవేంద్రగౌడ్, పి.వనజాక్షమ్మ, జి.రమేష్‌గౌడ్, సి.మధురిమరాణి, ఎల్.పవన్‌కుమార్‌రెడ్డి, సి.రవికుమార్, ఎస్.సాయికుమార్, శింగనమలలో పనిచేస్తున్న కె.వెంకటేశ్వర్లు, ఎల్.బద్రీనారాయణ (గుత్తి), ఎస్.నూరుల్ హుదా (గుంతకల్లు), కె.శ్రీనివాసాచారి (కొనకొండ్ల), పి.అమీర్‌బాషా (కల్లూరు ఆర్‌ఎస్), ఎస్.చాంద్‌బాషా (తాడిపత్రి), పి.విశ్వనాథ్ (రాయలచెరువు) ఉన్నారు.

అలహాబాద్‌లో సోమందేపల్లి వాసి మృతి

సోమందేపల్లి: మండల కేంద్రం సోమందేపల్లిలోని పాతూరుకు చెందిన గుట్టి సునందమ్మ (68) అలహాబాద్‌లో సోమవారం మృతి చెందారు. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన పలువురితో కలసి తీర్థయాత్రకు బస్సులో ఆమె బయలుదేరి వెళ్లారు. అలహాబాద్‌కు చేరుకున్న సమయంలో గుండెపోటుకు గురై ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇద్దరు పోలీసు అధికారులపై చర్యలు

అనంతపురం: ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లకు సంబంధించి ముందస్తు అప్రమత్తం చేయడంలో విఫలమైన ఇద్దరు పోలీస్ అధికారులపై చర్యలు తీసుకున్నారు. భద్రత, నిఘా వైఫల్యానికి బాధ్యులుగా పేర్కొంటూ జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ జాకీర్‌హుస్సేన్‌ను మంగళగిరిలోని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

'నైరుతి'కి అనుకూల వాతావరణం

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల ప్రవేశానికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి సోమవారం తెలిపారు. అరేబియా సముద్రం, కొమెరిన్, మాల్దీవులు, లక్షద్వీప్ ప్రాంతాల నుంచి కేరళ ప్రాంతానికి నైరుతి రుతుపవనాలు సాగడానికి అనుకూలంగా ఉన్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. ప్రస్తుతం ఏపీ, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నట్లు తెలిపారు. రాగల మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురుస్తాయని, పొడి వాతావరణం ఉంటుందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే సూచన ఉందని తెలిపారు.

60 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలు చూపుతున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. జాబ్ అచీవర్స్ డే సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులు క్యాంపస్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హరీష్‌బాబు తెలిపారు. ఈసీఈ విభాగం నుంచి 37 మంది, సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి 23 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెనుకొండ పీఆర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ మురళీమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల బోధనా సిబ్బంది హరినాథ్‌బాబు, సత్యకీర్తిపాణి తదితరులు పాల్గొన్నారు.

తండ్రితో తాగుడు మాన్పించలేక..



విష్ణువర్ధన్ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: మద్యానికి బానిసైన తండ్రిని మార్చుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం వీరాంజనేయపల్లికి చెందిన వడ్డే రాజేష్, రేవతి దంపతులకు ఓ కుమార్తెతో పాటు కుమారుడు విష్ణువర్ధన్(19) ఉన్నారు. బేల్దారి పనులతో పాటు వ్యవసాయ కూలి పనులు చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. ప్రస్తుతం విష్ణువర్ధన్ అనంతపురంలోని ఓ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. చాలా కాలంగా రాజేష్‌కు మద్యం సేవించడం అలవాటుగా ఉండేది. ఇటీవల అది శ్రుతిమించి మోతాదుకు మించి మద్యం తాగి మత్తులో ఎక్కడపడితే అక్కడే పడిపోయేవాడు. గమనించిన చుట్టుపక్కల వారు రాజేష్ ఆచూకీ తెలపడంతో కుటుంబసభ్యులు వెళ్లి ఇంటికి పిలుచుకువచ్చేవారు. ఈ నేపథ్యంలోనే తెలిసిన వారు పలుమార్లు రాజేష్‌తో మద్యం అలవాటు మాన్పించాలని కుటుంబసభ్యులకు చెబుతూ వచ్చారు. అయితే తమ మాట తండ్రి వినకపోవడం... తరచూ చుట్టుపక్కల వారు హితబోధనలు చేయడం వంటి చర్యలతో సమాజంలో తలెత్తుకుని తిరగలేని స్థితికి చేరుకున్నామని కుటుంబసభ్యులు లోలోన మదనపడేవారు. ఆదివారం సాయంత్రం అమగొండపాళ్యం రోడ్డు పక్కన మద్యం మత్తులో రాజేష్ పడి ఉన్నాడని తెలుసుకున్న విష్ణువర్ధన్ అక్కడకు చేరుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి చేర్చాడు. ఆ సమయంలో తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేనప్పుడు తాగుడు ఎందుకు అంటూ కుమారుడు నిలదీశాడు. కుమారుడి వాదనలతో తండ్రి ఏకీభవించకుండా తనదైన శైలిలోనే సమాధానమిస్తూ వచ్చాడు. దీంతో ఇక తండ్రిలో మార్పు రాదని గ్రహించిన విష్ణువర్ధన్... ఆదివారం రాత్రి ఇటీవల నిర్మించిన ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా పాత ఇంటికి చేరుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం విష్ణు అవ్వ పాలు పితకడానికి పాత ఇంటి వద్ద ఉన్న పశువుల పాక వద్దకు వెళ్లింది. ఆ సమయంలో ఉరికి విగతజీవిగా వేలాడుతున్న మనవడిని చూసి గట్టిగా కేకలు వేసి అప్రమత్తం చేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ కృష్ణమూర్తి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కుటుంబాన్ని నిలబెడతాడనుకున్న కుమారుడు చనిపోవడంతో కుటుంబసభ్యుల రోదనలకు అంతులేకుండా పోయింది.

50 శాతం రాయితీతో రాగులు, కొర్రలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు వివిధ రకాల విత్తనాలు రాయితీతో ఇవ్వడానికి వీలుగా ధరలు, రాయితీలు ఖరారు చేశారు. ఇప్పటికే 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 50 శాతం రాయితీతో 225 క్వింటాళ్ల జనుము, జీలుగ లాంటి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఇక అంతర పంటల కింద కందులు, పెసలు, మినుములు, చిరుధాన్యాల కింద కొర్రలు, రాగులు రాయితీతో ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ అధికారులు తెలిపారు. నీటి వసతి కింద రెండు రకాల విత్తన వరి అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో తమ వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

- ఎల్‌ఆర్‌జీ–52, ఎల్‌ఆర్‌జీ–105, ఐసీపీఎల్–87119 రకాల విత్తన కందులు 2,300 క్వింటాళ్లు కేటాయించారు. పూర్తి ధర క్వింటా రూ.13,980 కాగా 30 శాతం రాయితీ రూ.4,194 పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,786 (కిలో రూ.98) ప్రకారం చెల్లించాలి. 4 కిలోల ప్యాకెట్ రూపంలో ఇవ్వనున్న కందులు భూ విస్తీర్ణాన్ని బట్టి 10 ప్యాకెట్ల వరకు ఇవ్వనున్నారు.
- ఐపీఎం2–14, ఐపీఎం410–3 రకాలకు చెందిన విత్తన పెసలు 85 క్వింటాళ్లు కేటాయించారు. వీటి పూర్తి ధర క్వింటా రూ.13 వేలు కాగా 30 శాతం రాయితీ రూ.3,900 పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,100 (కిలో రూ.91) ప్రకారం చెల్లించాలి. 4 కిలోల ప్యాకెట్ రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.10 ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- పీయు–31, ఎల్‌బీజీ–752, ఐపీయు–2–43, టీబీజీ–104, వీబీఎన్8 లాంటి మినుములు 46 క్వింటాళ్లు కేటాయించారు. క్వింటా రూ.14 వేలు కాగా, 30 శాతం రూ.4,200 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,800 (కిలో రూ.98) చెల్లించాలి. 4 కిలోల ప్యాకెట్ రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా 10 కిలోలు ఇవ్వనున్నారు.
- ఎస్‌ఐఏ–3156, ఎస్‌ఐఏ–3159 లాంటి కొర్ర రకాలు 50 క్వింటాళ్లు కేటాయించారు. క్వింటా రూ.8,740 కాగా, ఇందులో 50 శాతం రూ.4,370 రాయితీ పోనూ రూ.4,370 (కిలో రూ.43.70) ప్రకారం చెల్లించాలి. కొర్రలు 2 కిలోల ప్యాకెట్ల రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా 5 ప్యాకెట్లు ఇస్తారు.
- ఇంద్రావతి, వేధావతి రకాలకు చెందిన విత్తన రాగులు నాలుగు క్వింటాళ్లు కేటాయించారు. క్వింటా రూ.7,250 కాగా, 50 శాతం రాయితీ రూ.3,625 పోనూ రైతులు రూ.3,625 (కిలో రూ.36.25) ప్రకారం చెల్లించాలి. 2 కిలోల ప్యాకెట్ రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా ఆరు ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- బీపీటీ–5204, ఆర్‌ఎన్‌ఆర్–5,048 రకాలకు చెందిన విత్తన వరి 1,600 క్వింటాళ్లు కేటాయించారు. వీటి ధర రూ.4,180 కాగా ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం కింద రూ.1,000, నాన్ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం కింద రూ.500 ప్రకారం రాయితీ వర్తిస్తుంది. మిగతా మొత్తం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. 25 కిలోలు, 30 కిలోల ప్యాకెట్ల రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా నాలుగు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.